ఏమిటో? భార్య దగ్గర భర్తకు, భర్త దగ్గర భార్యకూనా అభిమానం! ఏదో తాత్కాలికంగా మనసుకు బాధ కలిగినా, ప్రేమ వున్నచోట అభిమానానికి కవకాశమెక్కడుందో నా కర్థం కాదు. మాట పట్టింపులతో ప్రేమ కక్షగా యెలా మారిపోతుందో తెలియదు. భార్య, భర్త అన్న తరువాత యెప్పటి కోపాలప్పుడే మరిచిపోవాలిగాని యీ పంతాలేమిటి?

"...............…"

"వెళ్లరన్న మాట?"

"నన్ను శిక్షించేందుకు వేరేమార్గం లేదా హేమా నీకు?"

"శిక్షా? ఇది శిక్షన్న మాట! భేష్. సరే, యీ పంతాలు, కక్షలు, అభిమానాలు, యెలా గుంటాయో నేనూ రుచి చూస్తాను. రాత్రే నాదో వనేను చూసు కుంటాను" గంభీరంగానే అంది హేమ. అసలే వ్యాకులంతో మనసు చెదిరి వున్న ప్రసాదు మీద మంత్రం బాగా పని చేసింది. అతనొక్కసారిగా అదిరిపడి హేమను దగ్గిరకు తీసుకుంటూ,

"ఆ పనిమాత్రం చేయకు హేమా. జీవితంలోని వెలుగును చూడటం నేర్చుకుంటున్న నన్ను మొదట్లోనే అంధకారంలోకి తోసెయ్యకు."

హేమకు జాలివేసింది. అతని మాటలు వింటూంటే దుఃఖంకూడ వచ్చింది. కాని తను కఠినంగా వుండకతప్పదు.

"మీ రనవసరంగా ఖంగారు పడుతున్నారు" అంది నెమ్మదిగా.

"సరే నీమాటప్రకారం వెడతానే అనుకో. ఒకవేళ నేను వెళ్ళినా ఆమె రాకపోతే ఏం చేయమంటావు?" చిన్నపిల్లాడికిమల్లే వేసిన ఆప్రశ్నకు హేమకు నవ్వు వచ్చింది.

"మీకా భయమవసరం లేదు. రెండు సంవత్సరాల అనుభవమామెకు చాలును. మీరు వెడితే ఆమె తప్పక వస్తుంది మీతో!" అని ధైర్యం చెప్పింది హేమ.

(వచ్చే సంచికతో ఆఖరు)

స్కెచ్

# కొత్త కోడలు

## పి. సత్యనారాయణమూర్తి

కోడలు కాపరానికి వస్తుందనగానే ఇంట్లో కొంత సంచలనం కలిగింది. కలగదు మరీ! కొత్తకోడలూ- అందులో పట్నవాసం కోడలూను. ఆమె వస్తుందనే వార్త భయాన్ని కలిగించకపోయినా ఆ ఇంట్లోవాళ్ళకి ఆదుర్దానైనా కలిగించిందనే చెప్పాలి. అప్పటిదాకా దేన్ని గురించీ ఆలోచించనివాళ్ళ మెదడులు ఈ వార్తతో తీవ్రంగా పనిచెయ్యడం ప్రారంభించాయి. ఆమె ఎల్లావుంటుంది? ఏమంటుంది? పల్లెటూరు మనుష్యుల్ని చూసి అసహ్యించుకుంటుందా? ఆక్షేపిస్తుందా? అసలింతకీ సజావుగా కాపరం అంటూ చేస్తుందా? అనే ఆలోచనల్తో అత్తగారు సతమత మవుతూ అస్తమానం భర్తను సాధించే అలవాటుని తాత్కాలికంగా మరిచిపోయింది.

మామగారు నిశ్చింతగా కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటూన్నా కొత్త కోడల్ని గురించి ఆలోచించకుండా ఉండలేక పోతున్నాడు. అతని భయం అల్లా ఒక్కటే! రెండు పూట్లా తిని కూర్చోవడం తప్పితే మరేం చెయ్యటంలేదు అని తనని సోమరిపోతుగా జమకట్టేస్తుందని భయం. అతని పెద్దకొడుక్కి మరదలు వస్తుందంటే మరేం భయంలేదు. కాని తమ్ముడి గదిలో రాత్రింపగళ్లు తృప్తితీరా తను గుర్రుపెట్టి నిద్రపోవడానికింక వీలుండదేమో అని భయం. తను చేసే ప్రతిపనిలో వాటాపెట్టిఅత్త

గారితో సమానంగా సాధించే సావకాశంవస్తోందని సరదాగానే ఉంది. కాని, పట్నవాసంది కావడంవల్ల ఎలాఉంటుందోఅని భయం,ఆఇంటి పెద్దకోడలికి.అసలు మనిషికి,తనభార్య కాపరానికి వస్తుందంటే ఎంత సరదాగా ఉందో అంత దిగులుగాకూడా ఉంది. అతని మనస్సు పరిపరి విధాల పోతోంది. తనకున్న అలవాట్లూ అభిరుచులూ ఒకమారు సమీక్షించుకుని విమర్శించుకున్నాడు. సరిపెట్టుకున్నాడుకూడా. అయితే ఒక చిక్కు. పట్నవాసం భార్య! అందుకే అతనికేం పాలు పోవడంలేదు. ఇంక ఎటొచ్చీ మిగిలినవాడు మరిది. ఆ పన్నెండేళ్ళ పసిహృదయానికి వచ్చే కొత్త వదినమీద ఏ నిశ్చితమైన అభిప్రాయాలూ లేకపోయినా ఎంతో ఆసక్తితో, ఎందుకో తనకే అర్థంకాని కంగారుతో ఎదురుచూస్తున్నాడు. మొత్తానికి కొత్త కోడలు కాపురానికి వస్తుందనడంవల్ల ఆ ఇంట్లో అహరహమూ అవిరళంగా సాగిపోయే కొట్లాటలూ, అల్లరులూ హఠాత్తుగా ఆగిపోయాయి. ఎవరిమట్టుకి వారే నిశ్శబ్దంగా తమ పనేదో తాము చేసుకుంటూ ఉమ్మడిగా అంతా కలిసి రాబోయే ఏ మహాప్రమాదాన్నో ఎదుర్కోడానికి సిద్ధపడుతున్నట్లు ప్రవర్తించారు ఆరోజల్లా.—

సరే కొత్తకోడలు వచ్చింది. ఇంటిల్లిపాదీ "మామూలుగానే వచ్చిందే, మనంఅనుకున్నట్లు విపరీతం ఏమీలేదే" అని ఒక్క క్షణం అనుకున్నా, వెంటనే ఆ భావాన్ని వాళ్ళవాళ్ళ హృదయాంతరాలలో తొక్కేసుకుని 'పట్నవాసం పిల్ల' అనే విషయాన్ని బలవంతంగా జ్ఞాపకానికి తెచ్చుకున్నారు. ఆ రోజంతా ఇంట్లోవాళ్లు ఎంతో గంభీరంగానూ నిశ్శబ్దంగానూ ఉన్నారు. వాళ్లు చేసే ప్రతి పనీ అతిజాగ్రత్తగా జేస్తూ, ఆ పనిని ఇంకో కొత్త వ్యక్తి పరిశీలిస్తున్నారనే భావాన్ని ద్యోతకం చేస్తూనే ఉన్నారు. ఆ రోజున ఎవళ్ళూ తక్కిన వాళ్ళతో మాట్లాడలేదనే చెప్పాలి. ఆ ఇంట్లో ప్రతీవ్యక్తీ ఆరోజున ఏమీ శబ్దం చెయ్యకుండా యంత్రంలా తన పని తాను చేసుకుపోయారు. మిగిలిన వాళ్లేమనుకున్నారో గాని మామగారు మాత్రం ఈ రోజుకింక సాధింపులూ, కొట్లాటలూ అల్లరులూ పోయాయికదా అని సంతోషించాడు. ఈ శాంతి తాత్కాలికమే అయినా, ఆమాత్రం శాంతి అయినా కొత్త కోడలు వల్లే లభించిందనే భావం అతని మెదడ్లో తళుక్కుమని మెరిసి, ఆమెకు కృతజ్ఞత లర్పించాడు మనస్సులో.

రోజులు గడుస్తున్నాయి. కొత్తగా వచ్చిన కోడలు పట్నవాసంది అయినా విపరీత లక్షణాలు కనిపించక పోవడంతో తాము అనుకున్నది పూర్తిగా భ్రమ అని క్రమేపీ తెలుస్తూ వచ్చాక ఆఇంట్లో వ్యక్తులకి ఆమెఅంటే భయం తగ్గిపోయింది. కాని ఆమెతో మాట్లాడ్డానికి చనువూ, తమ పూర్వపు అలవాట్లని తిరిగి ఆచరణలో పెట్టడానికి ధైర్యం లేకపోయింది వాళ్ళకి. దాంతో అస్తమానం కబుర్లతోనూ కజ్జాలతోనూ ఉండేవాళ్లు నిశ్శబ్దంగా రోజులు గడుపుతున్నారు. అత్తగారు కోడలి ఎదురుగుండా మామగార్నీ, పెద్దకోడల్నీ, కొడుకుల్నీ మామూలుగా సాధించడానికి ధైర్యం లేక ఏమీ అనకుండా ఊరుకుంది. మావగారి కేకలూ, పెద్దకోడలి విసుగూ, అన్నదమ్ముల కొట్లాటలూ అంతరించాయి. ఈ మార్పంతటికీ కారణం మరేం లేదు. కొత్తకోడలు ఏమనుకుంటుందో అనే భయం! అదీకాక ఆ కోడలు తరుచుగా విస్తారం మాట్లాడకపోవడం కూడా ఆ ఇంట్లో వ్యక్తుల భయాన్ని ద్విగుణీకృతం చేసింది. ప్రతివారిలోనూ కలిగిన పరిణామం అందరికీ అసహజంగానూ ఇబ్బందిగానూ ఉన్నా, ఎవళ్ళూ తెగించి మామూలుగా ఉండలేకపోతున్నారు. రోజులు గడుస్తున్నాయి.

అసలా కోడలు సాధారణంగా మాట్లాడనే మాట్లాడదు. అప్పుడప్పుడు మాత్రం చిరునవ్వు నవ్వుతుంది. అదైనా అనవసరంగా కాదు. ఆ చిన్న కోడలు ఎవరినిగురించి చిన్నగా నవ్వుతుందో ఆ నవ్వు అవ్యక్తిమీద పరిపూర్ణంగా పని చేసి తీరుతుంది. అదే ఆమెకి ఆయుధం. ఆ ఆయుధానికా ఇంట్లో వ్యక్తులందరూ సిగ్గుపడి లొంగిపోతారు. ఆఖరికి చిన్న మరిది దగ్గర నుంచీ అందరినీ ఆ మందహాసమే వాళ్ళవాళ్ళ చెడ్డ అలవాట్లనుంచి మార్చివేసింది. ఒకరోజున

ఆ పన్నెండేళ్ళ కుర్రాడు వీధిలోకి వెళ్ళి ఆట లాడి బూడిద బట్టలతో ఇంటికివచ్చాడు. తల్లి వాడినిచూసి చివాట్లు వేస్తోంది. అప్పుడామె వెళ్ళి అతనికి నీళ్లు పోస్తూపోస్తూ చిన్నగా నవ్వింది. కొత్తవదిన నవ్వుచూసి మరిది సిగ్గు పడ్డాడు. అంతే! ఆ రోజునుంచి బట్టలు బాడి చేసుకురాలేదతను. ఈ విధంగా ఎన్నాళ్ళ నుంచో అతనిలో ఘనీభవించిపోయిన దురల వాటుని ఒక్క మందహాసంతో పోగొట్టింది.

మనుష్యుల మనస్తత్వాలూ, అలవాట్లే కాక ఆఇంట్లో వాళ్ళ దినచర్యలోనే ఒక నూతన చైతన్యం, సజీవపరిణామం గోచరిస్తూ వచ్చింది కొత్తకోడలు కాపరానికి వచ్చిన తర్వాత. ఆమె వచ్చిన మర్నాడు తెల్లవారుఝామున వీధి తుడిచి నీళ్లు చల్లుతున్న చప్పుడయింది. సూర్యో దయం కాకుండా లేవడం అలవాటులేని ఆ ఇంట్లో మనుష్యులికి కొత్త కోడలు తెల్లవారు ఝామునే బద్ధకంలేకుండా లేవడం, దినచర్య ప్రారంభించడం అద్భుతంగానూ ఆశ్చర్యం గానూ కన్పించింది.

ఆ రోజునుంచీ రోజురోజూ ఆ ఇంట్లో ఒక నూతనవిధానం గోచరిస్తూనే ఉంది. కాఫీ పొయ్యిదగ్గర కొట్లాడుకునేవాళ్ళకి ముఖం కడుక్కొని వచ్చేటప్పటికి గ్లాసులలో కాఫీ రెడీగా ఉండటం కొత్తలో ఆశ్చర్యాన్నే కలిగించింది. స్నానానికి వెళ్లేటప్పటికి నూతి దగ్గర బిందెతో నీళ్లూ, తువ్వాలూ, సబ్బూ, ఉంటూవచ్చాయి. ఏవస్తువుకా వస్తువు ఏది కావలసిన పైనుకది అమర్చబడుతూండటంతో కొత్తలో ఆశ్చర్యాన్ని కలిగిస్తూ వచ్చినా రానురాను ఆహ్లాదాన్ని ఇచ్చేది. ప్రతిఫలంగా ఆమెఅంటే గౌరవ కృతజ్ఞతాభావాలా ఇంట్లో అందరికీ కలిగాయి.

అసలు ఏపనీ చేస్తున్నట్లే కనిపించకుండా అడుగడుక్కూ అవసరమైన అన్ని పనులూ అమర్చే కోడల్ని చూస్తే ఆఇంట్లో వ్యక్తుల్లో కూడా క్రమక్రమంగా చైతన్యం వచ్చింది. అసలు పని అంటే ఏవిటో తెలియకుండా అప్పటివరకూ కూర్చున్న పురుషపుంగవులకామె పరిచర్యలు కనువిప్పును కలిగించాయి. ఎక్కడి సోమరితనం అక్కడికి పోయింది. మావగారు రాట్నంమీద దారం తియ్యడం మొదలు పెట్టారు. అప్పటివరకూ రైతులకి కౌలుకిచ్చిన పొలం స్వాధీనం చేసుకుని పెద్దకొడుకు వ్యవ సాయం చెయ్యడానికి పూనుకున్నాడు. భార్య చెప్పనవసరం లేకుండానే రెండోవాడు ఎడ్లూ బండీ కొని పట్నానికి బండి తోలడం ప్రారం భించాడు. వదిన మెప్పును సంపాదించాలని మరిది బళ్ళో చేరి గట్టిగా చదవడం మొదలు పెట్టాడు. ఇంట్లో పనికి అత్తగారికి అన్ని విధాలా సహాయపడుతూనే దొడ్లో కూర గాయల చెట్లు పెంచుతూ కోడళ్లిద్దరూ ఇంట్లో తక్కిన పనులు చేస్తున్నారు.

కొత్త కోడలు కాపరానికి వచ్చినతర్వాత చాలా వసంతాలు గడిచాయి కాని ఆమె ఇంకా కొత్త కోడలుగానే ఉండిపోయింది ఆ యింటికి—

ఏమంటే ఆమె ఎవరితోనూ తరు చుగా మాట్లాడదు. అవసరం అయితే మంద హాసం చేస్తుంది. అందుకే ఆమె అంటే ఇంట్లో వాళ్ళందరికీ భయంలేకపోయినా గౌరవం ఉంది. వాళ్లుచేసే ప్రతిపనీ అతి జాగ్రత్తగా ఇంకో క్రొత్తవ్యక్తి పరిశీలిస్తున్నారనే భావం ద్యోతకం అయేలాగ చేస్తారు. తమని ఎక్కడ సోమరు లనుకుంటుందో, ఏవిధంగా అసమర్థులనుకుం టుందో అనే అదటే వాళ్ళకి. తాము పల్లె టూరి వ్యక్తులము కామని నిరూపించుకోవాలనే తహతహ ఆ ఇంట్లో వాళ్ళకింకా పోలేదు. అది పోనంతకాలమూ మె కొత్త కోడలే. ఆమెకోరికా వాళ్ళకోరికాకూడాఅదే! అందుకే ఆమె ఇంకా కొత్తకోడలులా ప్రవర్తిస్తూంది. వాళ్ళుకూడా ఆమె కొత్తకోడలుగానే ఉండా లని ఆకాంక్షిస్తున్నారు. ఆ విధంగా కొత్త కోడలు కొత్త కోడలుగానే ఉండి పోయింది ఆ యింట్లో.